# డాక్టర్ అరుణ

వైద్యవృత్తిలో ఆశయ సాధనకుఆత్మవిశ్వాసం పట్టుగొమ్మ. అదేమాట మెడికల్ కాలేజీలో పదేపదే విన్నాను. పుట్టి పెరిగింది పల్లెతల్లి ఒడిలో. చదువు సాగించింది పట్నం ఒడిలో. మెడిసిన్‌కోర్సులో మునిగి తేలింది మెగాసిటీ హైదరాబాదులో. గుడిలాంటి ప్రభుత్వాసుపత్రిలో మెడికలాఫీసరుగా చేరాను.

కోర్కెల రేసు గుర్రానికి కళ్లెం బిగించడమో పరీక్ష.

సూర్యోదయంతో పోటీ పడుతూ నిద్ర లేవడం, తయారై డ్యూటీ కెళ్లి రావడం కష్టమనిపించలేదు రోజూ... మొదట ఇన్ పేషంట్స్‌ను పలకరించి వచ్చి ఔట్ పేషంట్స్ క్యూ ముందు కూచుంటున్నాను. రోగులకు పరీక్షించి మందులిస్తుంటే తృప్తిగా వుంది.

ఎంసెట్‌లో ఎక్సలెంట్ ర్యాంకు సాధించి యం.బి.బి.ఎస్. కౌన్సిలింగ్ కెళ్లే ముందు, మా నాన్న నా గురించి వాళ్ల అమ్మతో చెప్పాడు. ఒంటిమీద బల్లి పడ్డట్టు నానమ్మ ఉలిక్కిపడింది. సొట్ట చెంపల్ని పొట్టి వేళ్లతో నొక్కుకుంటూ "ఆడపిల్లకంత పెద్దచదువులెందుకు నాయనా? లక్షణంగా పెళ్లి చేసి బాధ్యతల బరువు దించుకోరా!" ఉచిత సలహా ఇచ్చింది.

ముసల్దాన్ని ముక్కుమీద ఒక్కటి పీకాలన్పించింది.

నా హావభావాలను చదివేసిన అమ్మ "ఈ రోజుల్లో ఆడవాళ్లు అన్ని రంగాల్లో ముందుంటున్నారత్తయ్యా. మనలా మెడలో మూడు ముళ్లేయించుకుని నాలుగ్గోడల మధ్య పడుండరు. అయినా..."

కమ్మని మాటలతో క్లాసు పీకి ఆమోదముద్ర వేయించింది. మా యింట్లో అమ్మ నిర్ణయానికి ఆపీలుండపదు.

గవర్నమెంలాస్పిటల్లో జాయినవగానే మా బాసు స్వాగతించి "ఇది పట్టణంగా మారుతున్న పెద్ద పల్లెటూరు. గ్రామ రాజకీయాలు వైకుంఠపాళి ఆటలాంటివి. జాగ్రత్తగా ఉంటే మన వైద్యవృత్తి ఇలాంటి ఊళ్లోనే సార్థకమవుతుందమ్మా!" ఆత్మీయంగా గీతోపదేశం చేశాడు. ఆయన సీనియర్ డాక్టర్, డిప్యూటీ సివిల్ సర్జన్. ఆ మాటలు నా మనోఫలకం మీద చెరగని ముద్రవేశాయి. మర్నాడు ఉదయం హాస్పిటల్ టైం... ఎనిమిదింటికి డ్యూటీ కొచ్చాను.

స్వీపరు తప్ప ఎవరూ కనబడలేదు. "ఏమ్మా! ఇంత ఆలస్యంగానా ఊడ్వడం?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఆలస్యమా...! ఇయ్యాల్ల ముందుగొచ్చిన!!" వంగిన నడుము లేవలేదు.

"ఎనిమిదింటికే పేషంట్స్ వస్తుంటరు. ఆ లోగా శుబ్బరంగా ఊడ్చి, కుర్చీలు - టేబుళ్లు తుడిచి ఉంచాలి గదా!"

నిటారుగా నిల్చుండి చీపురు కింద పడేసింది. కొంగు బిగించి నడుమ్మీద చేతులానించింది. దవడ కీళ్ళని కసిగా నమిలింది. "ఇక్కడ ఇదే అలవాటు మేడం!" మూతి మూడు వంకర్లు తిప్పింది రోషంగా.

"ఇక ముందిట్లా కుదరదు." వార్నింగ్ వడ్డించాను. ఆ సంగతి మిగతా ఉద్యోగులందరి చెవుల్లో ఊదిందామె! ఆ రోజంతా...

"కొత్త బిచ్చగాడు పొద్దెరగడు గదా!"

"పిల్ల కాకికేం తెలుసు ఉండేలు దెబ్బ!"

"నాలుగు రోజులైతే నలుగురితో నారాయణ అంటుంది." సిబ్బంది గుసగుసలు చెవులారా విన్నాను.

ఔటు పేషంట్స్‌ను పరీక్షించి మందులిచ్చి పంపిస్తున్నాను. ఓ ముసలావిడ సంతోషంగా మందులందుకుని నా తలచుట్టూ చేతులు తిప్పి మెటికలు విరుచుకుంది."తల్లే! ఆ దేవుడు నిన్ను చల్లగా చూడాలమ్మా" మురిసిపోయింది. పాలకోవా తిన్నట్టనిపించింది. సహోద్యోగులు రాజీకొచ్చి నా దారికొచ్చారు.

హాస్పిటల్ ఆవరణలో డిప్యూటి సివిల్ సర్జన్‌కు రెసిడెన్షియల్ క్వార్టరుంది. ఆయనకు పదకొండు తర్వాతే ప్రభుత్వాసుపత్రి గుర్తుకొస్తుంది. ప్రైవేట్ ప్రాక్టీసు "నిత్యకల్యాణం పచ్చతోరణం" లాగుంటుంది.

ఆ రోజు... ఒకాయన వచ్చి కూచున్నాడు. వయసు నలభై దాటొచ్చు. లీడర్లాగున్నాడు. కాబట్టి వెంట ఓ శిశ్యుడున్నాడు. నేను ఔటు పేషంట్సును చూస్తున్నాను.

"అల్ల... హాల్లో... డాక్టరూ!" ఆయాసంతో రొప్పుతున్నాడు.

"హాల్లో సార్, గుడ్ మార్నింగ్!" అతన్ని పూర్తిగా గమనించాను. మల్లెపూవు లాంటి తెల్లని ధోవతి. గోధుమ రంగు సిల్క్‌లాల్చీ. రింగుల జుట్టు, పొడగాటి మీసాలు. క్యూ పేషంట్సు గుసగుసలాడుతున్నారు.

"ఇటొచ్చి ఈ స్టూలు మీద కూర్చోండి." అతన్నే ముందు పరీక్షించాలనుకున్నాను.

ఆయాస పడుతూనే నా చెవి రింగులను, ఒంటిరాయి ముక్కు పుడకను అసహనంగా చూస్తున్నాడు. "నీ పరీక్ష తర్వాత. ముందు గ్లుకోజు ఎక్కించమ్మా!" ఎడమ చేత్తో ఛాతి పిసుక్కుంటూ కుడిచేతులున్న చీటిని నా ముందుకు తోశాడు. అది మా బాసు రాసిన చీటీ "గ్లూకోజ్ రెండు బాటిల్స్ వెంటనే ఎక్కించాల"నుంది. అతని శిష్యుడు ఒంటికాలు మీదున్నాడు.

"సర్పంచ్ సాబుకు అవస్త బాగా వుంది. గ్లూకోజ్ త్వరగా ఎక్కించమ్మా" చేతులు జోడించాడు. అయితే ఈ లీడర్ రోగి ఈ ఊరి మేజర్ పంచాయితీ సర్పంచన్నమాట. అయినా అతని రుగ్మత ఏమిటో తెలియక ముందే వైద్యం చెయ్యాలా? పైట సర్దుకుని అతని వద్దకెళ్లి పరీక్షించాను. ఊపిరితిత్తులు తోలు తిత్తిలా ఎగిరిపడుతున్నాయి. వాటినిండా నీరు నిండింది. గ్లూకోజ్ ఎక్కిస్తే మూల్గే నక్క మీద తాటిపండు పడ్డట్టవుతుంది. మరి... మా బాసెలా రాశాడు?

"పెద్ద డాక్టర్ పరీక్షించి రాసిండా?" శిస్యున్ని అడిగాను.

"లేదమ్మా" నుదురు కొట్టుకున్నాడు. "సర్పంచ్ సాబు పెద్ద డాక్టర్‌కు చెప్పంగనే ఈ చీటి రాసిచ్చిండు. ఇది ఎక్కేలోగా తాను వస్తానన్నాడు."

"పెద్దమనుషులెవరొచ్చినా వాళ్ల బాధ చూడలేక పెద్ద డాక్టర్ గట్టనే రాసిస్తడు మేడమ్." అసలు విసయం చెప్పాడు కంపౌండర్.

రోగి మూలుగుతున్నాడు. కళ్లల్లో కోపం పేరుకుపోతున్నట్టుంది. నేను సర్దుక్కూచుని "ఈ పరిస్థితిలో

గ్లూకోజ్ ఎక్కించొద్దు. దీనికి వేరే వైద్యముంది. ముందు ఇంజెక్షనిస్తా.. "సముదాయిస్తున్నాను.

"నీయవ్వ!" సర్పంచ్ అరిచాడు. "నిన్నగాక మొన్న సర్కారు నౌకరి దొరికిందని మిడిసి పడ్తున్నావా? పెద్ద డాక్టర్ రాసింది గూడా కాదంటావా?" పళ్లు నూరుతూ లేచాడు. "అట్లా అంటే ఎట్లా డాక్టరమ్మా!" ఆవేశం, ఆయాసంతో కలిసిపోయింది. "ముందు గ్లూకోజ్ ఎక్కిస్తవా లేదా!" అరిచాడు.

శిష్యుని ఆందోళన అంతా ఇంతా కాదు. "డాక్టరమ్మా! సర్పంచ్ సాబ్ కోపానికొస్తే మనిషికాడు."

"పర్వాలేదు." నాలో ఉక్రోశం. "ఇప్పుడు గ్లూకోజ్ ఎక్కిస్తే ప్రమాదం."

సర్పంచ్ శివమెత్తి పోయాడు. "నీ యవ్వ... పోరీ! నేనిక్కడ అవస్త పడ్తుంటే నువు తమాష చూస్తవా?" నా స్టెతస్కోపు లాక్కుని టేబుల్ మీదికి విసిరేశాడు. అవాక్కయ్యాను.

అతని హెల్త్ కండీషన్ అతనికి తెలియదు. చెప్పినా వినడు. నాలో యువావేశం పొగుకొచ్చింది. "ఇట్లా మాట్లాడ్తే పోలీస్ రిపోర్టిస్తా." గుర్రుమన్నాను.

రోషంగా జేబులోంచి సెల్‌ఫోన్ తీశాడు. "హల్లో! ఎమ్మెల్యేసాబే గదా! ఆ అవునన్నా. మనూరి హాస్పిటల్‌కు కొత్త డాక్టరమ్మ వచ్చింది గదా! నేనేమో దమ్ము ఆడక హాస్పిటల్ కొచ్చిన. పెద్ద డాక్టర్ మందులు రాస్తే ఆమె ఇవ్వనంటుందన్నా...!" గోదు వెళ్లబోసుకున్నాడు. సెల్‌ఫోన్ నా చేతికిస్తూ "మన ఎమ్మెల్యేతో మాట్లాడు" అన్నాడు.

పాము పడగ మీద కాలేసినట్టనిపించింది.

కేసు పోజిషనంతా ఎమ్మెల్యేకు వివరించి చెప్పాను. సెల్‌ఫోన్ సర్పంచ్ కిమ్మన్నాడు. ఇచ్చాను. తిరిగి ఎమ్మెల్యేతో మాట్లాడకుండా అతడు దాన్ని జేబులో వేసుకున్నాడు. మొహం వికారంగా తయారైంది. "నువ్వో రుద్రమాంబవా, ఝాన్సీ రాణివా?" దమ్ము తీస్తూ రెచ్చిపోయాడు.

నాకు ఒళ్ళు మండింది. "మిష్టర్! మాటలు జాగ్రత్తగా రానీ" గాజుల పిడికిలి గాల్లోకి లేచింది. సర్పంచ్ కోపం కట్టలు తెంచుకున్నట్టుంది. "నీయవ్వ! నువ్వెంత? నీ లెక్కెంత?" నా చెంప ఛెళ్లుమన్పించాడు. హడలిపోయాను. తలలో జేజమ్మ గిరికీలు కొట్టింది. నాలో రోషం కట్టలు తెంచుకుంది. ఆడపిల్లంటే అబల అనుకున్నాడేమో!

సర్పంచ్ గల్లాపట్టి లాగి, రెండు చెంపలు ఎడాపెడా వాయించాను. "పో.. నీ దిక్కున్న చోట చెప్పుకో పో" వెనక్కు నెట్టేశాను. అతడు పడిపోకుండా మా కాంపౌండర్ పట్టుకున్నాడు. భుజాల మీద చేతులేసి బయటికి నడిపిస్తూ "సర్పంచన్నా! ఇది సర్కారు దవాఖాన. వసతులు సరిగా ,వుండవు. కారు దీస్కొని హైద్రాబాదుకు పొయ్యి చూపించుకో. మహా అంటే ఓ గంట తొవ్వ. అక్కడ అన్ని రోగాలకు స్పెషలిస్టులుంటరు గదా." ఆత్మీయంగా సముదాయించాడు.

ప్రశాంత వాతావరణంలో సుడిగాలి చెలరేగినట్టు ఘోరం జరిగిపోయింది. ఆవేశమే... నాది. అది ఆలోచనను మింగేసింది. అందుకే నానమ్మ అంటుంది. 'పదుచుదనం ఫెళుసుదన'మని.

కాంపౌండర్ అట్నుంచటే వెళ్లి చెప్పాడేమో... కొట్లాట ముగిసిం తర్వాత పోలీసులొచ్చినట్టు మా బాసు అంగలేస్తూ వచ్చాడు. స్టెతస్కోపు టేబుల్ మీదుంచుతూ "తొందరపడ్డావు అరుణమ్మా!" కూచున్నాడు. "ఆయన ఈ ఊరు సర్పంచ్. మన ఎమ్మెల్యేకు కుడి భుజం. ఆయన పీడా వదిలించుకోవాలని పరీక్షించకుండా

చీటీ రాసిచ్చాను. ఇలాంటి వాళ్లతో చాలా జాగ్రత్తగా ఉండాలి. డాక్టర్! పల్లెల్లో మన డ్యూటీ పల్లేరుకాయల మీద నడకలాంటిది."

నా లోపలి తుఫానింకా చల్లారలేదు. "ఇదంతా మీరిచ్చిన అలుసే గదా!" అందామనుకున్నాను. కానీ, ఆ మాటల్ని గొంతులోనే అదిమిపెట్టాను. "సార్" సర్పంచ్ ప్లూరల్ ఎఫ్యూజన్తో బాధపడుతున్నాడు. సెలైన్ ఎక్కిస్తే ఊపిరాడక ప్రమాదం జరగొచ్చు గదా!" అనగలిగాను. లావాలా పొంగుకొస్తున్న ఆవేశాన్ని అణిచివేయడం కష్టమైంది.

సీనియర్ డాక్టర్ క్షణం ఆలోచించి నాలిక్కరుచుకున్నాడు. "అది నిజమే! కానీ... ఈ విషయం ఎమ్మెల్యేదాకా అసెంబ్లీదాకా వెల్తుందేమో!" నెత్తి పట్టుకున్నాడు. చిరు చెమటలతో నా మొహం కందిపోయింది.

ఎలాగోలా ఔట్ పేషంట్స్‌ను చూసి పంపించాను.

అసంకల్పితమైనా... అనర్థం జరిగిపోయింది ప్చ్... 'రోట్లో తనకాయ పెట్టి రోకలి పోటుకు భయపడ్డమెందుకు?' రాత్రి అన్నం సయించలేదు. మనసు కొంగలు తొక్కిన మడుగులాగైంది. భారంగా నిట్టూర్చి మంచమ్మీద ఒరిగాను. ఆశలు, ఆశయాలు ఆకాశంలో పేలిపోయాన విమాన శకలాల్లా అయిపోవల్సిందేనా? 'అరుణ డాక్టరమ్మ దేవత' అని బీదా బిక్కీలు చెప్పుకుంటుంటే తృప్తిగా ఊపిరి పీల్చుకోవాలనుకున్నాను. ప్చ్ ఉద్యోగానికే ఎసరొస్తుందేమో? 'నాన్నకీ విషయం తెలిస్తే ఉద్యోగం మానేసి ఇంటికి రమ్మంటాడు...' అల్లిబిల్లి ఆలోచనలు మొదడు పొరల్లో గిరికీలు కొడ్తున్నాయి. అర్ధరాత్రయింది.

బయటికొచ్చి ఆకాశం వంకచూశాను. చుక్కల జల్లెడలో చందమామ చిక్కుకుంది. కమ్ముకున్న మబ్బుల్ని లక్ష్యపెట్టకుండా తనదారిలో తాను నిర్భయంగా పయనిస్తోంది. అది ఎంతో స్ఫూర్తి నిచ్చింది. భారమంతా భగవంతుని మీద వేశాక నిద్రాదేవి కరుణించింది.

రోజట్లాగే మెలకువొచ్చింది. కిటికీ తెరిచి చూశాను. ఆకాశ మైదానం బాల సూర్యకాంతుల్ని దిద్దుకుంటోంది. భారంగా అడుగులేస్తూ బాత్రూం నాశ్రయించాను. పనిమనిషి శాంతక్క వచ్చింది. అమ్మలా వంటచేసి పెడుతుంది. కాబట్టి ఆత్మీయురాలైంది.

మొహం కడుక్కున్నాను. డల్‌గా వుంది.

"ఏందమ్మా గట్లున్నరు? నిద్ర పట్టలేదా? అమ్మానాన్నలు గుర్తు కొచ్చింర్రా?" ఆప్యాయంగా అడిగింది శాంతక్క. జరిగిందంతా వివరంగా చెప్పాను. ముక్కుమీద వేలేసుకుంది. "ఓయమ్మో! సర్పంచ్‌ను కొట్టింర్రా? వాడు పగపట్టిన పాముగదా!" గాబరాగా గుండెలు బాదుకుంది.

"ఆడపిల్లంటే అంత అలుసా శాంతక్కా? ఈ రోజుల్లో ఆడవాళ్లమీద అత్యాచారాలు పెరిగిపోతున్నై. ఆ సర్పంచ్ నన్ను గూడా అబల అనుకున్నాడేమో?" పేపరందుకుని సోఫాలో కూచున్నాను. శాంతక్క చేతి చాయ్ సిప్ చేస్తూ వార్తలన్నీ చదివాను. నిన్నటి సంఘటన పేపర్లో కనబడలేదు. అదే సంగతి శాంతక్కకు చెప్పాను.

"పేపర్ల లేకపోతే ఏందమ్మా? ఊరందరికీ తెలిసుంటుంది. అయినా మీ జాగల మగ డాక్టరున్నా అదే జరిగేది. దుర్మార్గునికి ఆడ, మగ తేడా ఏముందమ్మా?"

నిజమే. మా బాస్ అన్నట్టుగానే సర్పంచ్ సామాన్యుడు కాదన్నది అప్పుడనిపించింది. నేనే యుక్తిగా మాటల్లోకి దింపి ఇంజక్షనిస్తే బాగుండేదేమో! దీని పర్యవసానం సస్పెన్షనో లేక క్రిమినల్ కేసో!.

వెన్నుపూసలోపన్నని వణకు.

హాస్పిటల్ సిబ్బంది నన్ను గౌరవంగా చూస్తున్నారు.

కొద్ది రోజులు ముభావంగా గడిచాదయి. ఎప్పుడేముతుందోనని మనసులో పీకుతూనే వుంది. మరికొన్ని రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం... బాలభానుని నునులేత కిరణాలు భూమాతకు బంగారు పూతలు పూస్తున్నాయి. స్నానాదులు పూర్తి చేశాను. పేపర్ చదివాను. శాంతక్క చేసిన ఉప్మా తిని వేడి చాయ సేవించాను, తయారై హాస్పిటల్ కెళ్లబోతున్నాను. వాళ్లింటి కెళ్లాలని శాంతక్క గడప దాటింది. వెంటనే వెనుదిరిగి లేడి పిల్లలా పరుగెత్తుకొచ్చింది.

"ఓ డాక్టరమ్మా! సర్పంచ్ సాబు రౌడీలతోని ఇటే వస్తున్నడు" వణికి పోతుంది. దమ్ము దీస్తుంటే గుండెలెగసి పడ్తున్నాయి.

నా గుండె కవాటాలు రెపరెపలాడుతున్నాయి.

'ఇప్పుడేం చెయ్యాలి? ఎలా... ఆలోచన ఓ కొలిక్కి రాకముందే సర్పంచ్ దండు లోపలికొచ్చింది. శాంతక్క భయం భయంగా చేతులు పిసుక్కుంటుంది. ఆంజనేయ దండకం లోలోపల వల్లిస్తూ కొంగు నడుముకు బిగించుకున్నాను. ఊపిరి బిగపట్టి "ఓ సర్పంచ్ సాబ్! ధైర్యముంటే యుద్ధానికి ఒక్కొక్కరు రండి." పిడికిలి పైకెత్తి సవాలు విసిరాను. రోషంతో పెదాలు వణుకుతున్నాయి.

"వారెవ్వా! మహిషాసుర మర్ధని లెక్కుందన్నా" ఒకడు గమ్మత్తుగా అన్నాడు.

"ఎట్లుంటే మనకేందిరా? మన పని మనం చేసుకుపోదాం" సర్పంచ్ మరొకనికేదో సైగ చేశాడు.

సైగ అందుకున్న వాడు పాకెట్ విప్పుతున్నాడు. నా పక్కన... బెదురుగా చూస్తున్న శాంతక్క వజవజ వణుకుతూ...ఆ పాకెట్ల బాంబులున్నయేమో!" చెవిలో అంది.

నా ఉచ్ఛ్వాస నిశ్వాసలు వేడెక్కుతున్నాయి. "చచ్చినా సరే భయపడేది లేదు శాంతక్కా!" రోషం రుసరుసలాడింది.

"అయ్యో! గట్టా వణుకుతున్నవెందుకు శాంతక్కా!" ఒకడు ముందుకొస్తున్నాడు. "నువు జర జరుగు శాంతక్క"

కాలెత్తి వాని పొత్తి కడుపులో తన్నాలనుకున్నాను.

పాకెట్ పూర్తిగా విచ్చుకుంది. అందులో పూలదండ..!?

సర్పంచ్ పూలదండ అందుకున్నాడు. "డాక్టరమ్మా! ఈ పూలదండ తీస్కో" ముందుకొచ్చి నా చేతుల్లో ఉంచాడు. దండం పెట్టి స్వీటు ప్యాకెటందించాడు.

స్వీటు ప్యాకెటు శాంతక్క చేతికిస్తూ "అసలిదంతా ఏమిటీ?" అడిగాను అయోమయంగా.

సర్పంచ్ మొహం తారాజువ్వలా వెలిగిపోతోంది. "చెంప దెబ్బదిని హైద్రాబాదుకు వోయిన. పెద్ద నర్సింగ్ హెూమ్‌ల ట్రీట్‌మెంట్ తీసుకున్నా. సంగతంతా అక్కడి డాక్టర్లకు చెప్పిన. ఆ రోజు నాకు అడగంగనే గ్లూకోజ్ ఎక్కిస్తే ఊపిరాడక చచ్చిపోయే వాన్నట. అక్కడ పెద్ద డాక్టర్లు చెప్పింద్రమ్మా. మీ ఊరి డాక్టరమ్మ మంచి పని చేసిందని మెచ్చుకున్నరు. నాకు చెల్లెలనుకుంటున్నా. ఈ అన్నను మన్నించమ్మా!" చేతులు జోడించిండు.

--- ÷ ---

(బతుకమ్మ - 19-8-2012)